క్లుప్తంగా

జహంగీర్‌కు నగదు పురస్కారం



నగదు పురస్కారం అందుకుంటున్న జహంగీర్‌జీ

కొత్తూరు: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా కలెక్టరేట్ ఆవరణలో అధికారులు కవి సమ్మేళనం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కొత్తూరు పట్టణానికి చెందిన కవి జహంగీర్‌జీ తన కవితాగానంతో పలువురిని మెప్పించారు. అనంతరం ఆయనను జిల్లా అదనపు కలెక్టర్ తిరుపతిరావు నగదు పురస్కారంతో సత్కరించారు.

కాలుష్య కారక పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి

కొత్తూరు: మండలంలోని పలు పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యాన్ని పీసీబీ అధికారులు అరికట్టాలని సీపీఐ మండల కార్యదర్శి షకీల్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుత సాంకేతికతతో కాలుష్యాన్ని నియంత్రించ వచ్చన్నారు. నిర్వహణ ఖర్చు కారణంగా నిర్వాహకులు యంత్రాలను ఉపయోగించడం లేదని తెలిపారు. దీంతో కాలుష్యం కారణంగా ప్రజలు అనారోగ్యాల బారిన పడడంతో పాటు భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా పీసీబీ అధికారులు మండలంలోని ఆయా పరిశ్రమలను సందర్శించి కాలుష్య నియంత్రణ పాటించని పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

నేడు కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ధర్నా

చేవెళ్ల: ప్రభుత్వ డిగ్రీకళాశాల భవనాన్ని వెంటనే ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎ. వీరేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. చేవెళ్లలో నూతనంగా నిర్మిస్తున్న డిగ్రీకళాశాల భవనం ఏళ్ల తరబడిగా అసంపూర్తిగా ఉందని చెప్పారు. భవనం లేక డిగ్రీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వారికి వెంటనే ఈ విద్యా సంవత్సరానికి భవనం వాడుకలోకి తీసుకురావాలని కోరారు. ధర్నాకు నియోజకవర్గం నాయకులు వసంతం, జిల్లా, రాష్ట్ర కమిటీ నాయకులు హాజరవుతారని చెప్పారు. ధర్నాను విద్యార్థులు, యువకులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కవులకు ఘన సన్మానం



సన్మానం పొందిన కవులు

షాద్‌నగర్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా కలెక్టరేట్‌లో కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ఆకుల మల్లికార్జున్, కిషోర్, గౌరీ శంకర్, హరీశ్ శర్మ, సర్వరాజ్ అన్వర్, సతీష్, మనోహర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ఆనందీశ్వర్‌రెడ్డి, నరేందర్‌రావు, రవిప్రకాష్ హర్మాశ్, వీరమణి, మహేశ్వరీ, నిర్మల తదితరులు హాజరయ్యారు. అనంతరం తెలంగాణ అమరుల త్యాగాలు, ఉద్యమ చరిత్ర, సాధించిన ప్రగతి అనే అంశాలపై కవితలు వినిపించారు. ఈ సందర్భంగా కవులను అదనపు కలెక్టర్ తిరుపతిరావు, డీఆర్డీఓ హరిప్రియ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ విశాల వారిని ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేశారు.

పార్టీ బలోపేతానికి సైనికుల్లా పని చేయాలి

కాంగ్రెస్ నాయకుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి



నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రం అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి అధికారంలోకి తీసుకు వచ్చేందుకు ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీ కాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండలంలోని కొండన్నగూడలో చల్లాశ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. నిరుపేదల సంక్షేమంకోసం అహర్నిశలు కృషి చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సాయిలు, మాజీ ఎంపీటీసీ సురేష్‌గౌడ్, నాయకులు రమేష్, అంజయ్య, రవీందర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం ఘనం.. ఆచరణలోనే నిర్లక్ష్యం

- నీటి కుంటల నిర్మాణాలపై అవగాహన కరువు
- సద్వినియోగం చేసుకుంటే చక్కని ఫలితాలు
- దృష్టి సారించని అధికారులు



వ్యవసాయ పొలంలో నిర్మించిన నీటి కుంట

కొత్తూరు: భారీ వర్షాలు కురిసినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాలు అంతగా పెరగడం లేదు. నీటి ఎద్దడి సమయాల్లో వ్యవసాయ రంగం ఒడిదుడుకులకు గురవుతోంది. ఇలాంటి పరిస్థితులను అధిగమించడంతో పాటు ఎక్కడి నీటిని అక్కడే భూమిలోకి ఇంకించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఉపాధిహామీ పథకంలో భాగంగా నీటికుంటలు(ఫాం పాండ్) నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పథకం ఆశయం బాగున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలులో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో ఆశించిన ఫలితాలు లేవు. దీంతో వర్షపు నీరు వ్యవసాయ పొలాలను దాటి రోడ్లపై, కాల్వల్లో వృథాగా పారుతోంది. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు పథకం గురించి క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహిస్తే చక్కని ఫలితాలు ఉంటాయి.

ముందుకు సాగని పనులు..

జాతీయ ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని భావించిన ప్రభుత్వం ఆ దిశగా దృష్టి సారించింది. సాగునీటి ప్రధాన కాల్వలు, ఉప కాల్వల్లో పూడిక తీయడం, చెక్‌డ్యాంల నిర్మాణం, ఇంకుడు గుంతలతో పాటు పొలాల్లో నీటి కుంటల నిర్మాణాలు అనుసంధాన ప్రక్రియలో ప్రధానమైనవి. వీటి వల్ల కూలీలకు పని లభించడమే కాకుండా భూగర్భ జలాలు పెరిగి పంటల దిగుబడి మరింత పెరగడానికి దోహదపడుతుంది. కాగా కొత్తూరు మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు 32 నీటి కుంటలను గత మూడేళ్ల క్రితం మంజూరు చేశారు. మల్లాపూర్‌లో 2, కొడిచర్లలో 4, శేరిగూడకు 6, సిద్దాపూర్‌కు 20 నీటి కుంటలు మంజూరయ్యాయి. మూడేళ్లు గడుస్తున్నప్పటికీ పలుచోట్ల పనులే ప్రారంభం కాలేదు. సిద్ధాపూర్‌లో 2, కొడిచర్లలో 2 కుంటల నిర్మాణాలను చాలా తక్కువ కొలతలతో రైతులు పూర్తి చేశారు. ఎస్‌బీపల్లిలో 6 కుంటలు పలు నిర్మాణ దశల్లో ఉన్నాయి.

అవగాహన ఎక్కడ?

నీటి కుంటల నిర్మాణాలు, వాటి వల్ల కలిగే ప్రయోజనాల గురించి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాల్సిన యంత్రాగం ఈ అంశంపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు. అందువల్ల రైతులు కూడా తెలిసి తెలియని పరిజ్ఞానంతో కుంటల నిర్మాణాలకు ముందుకు రావడం లేదు.

స్థలం అనువుగా ఉంటే చాలు..

ఏ పొలంలోనైనా వర్షపు నీరు ఏదో ఒక మూలకు చేరుతుంది. నీరు నిల్వ చేయడానికి అవకాశం ఉన్న పొలాల్లోని పల్లపు ప్రాంతాన్ని పని ప్రదేశంగా గుర్తించి నిర్మాణం చేపడుతారు. జాబ్‌కార్డులు ఉన్న ప్రతి రైతు నీటి కుంటలను నిర్మించుకునేందుకు అర్హులు. అనువుగా ఉన్న స్థలాన్ని బట్టి కుంటలను నిర్మిస్తారు. నిర్మాణం పూర్తయితే పొలంలో నుంచి పారే వరద నీరంతా కుంటలోకి చేరుకునే వీలుంటుంది.

నిర్మాణాలకు ముందుకు రావాలి



వరద నీరు నీటి కుంటల్లో చేరడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయి. తద్వారా వ్యవసాయ బోర్ల లోకి నీరు పుష్కలంగా వచ్చి పంటల దిగుబడి పెరుగుతుంది. రైతులు నీటి కుంటలను నిర్మించుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలి.

– శరత్‌చంద్రబాబు, ఎంపీడీఓ, కొత్తూరు

దేశాభివృద్ధికి ప్రధాని కృషి అభినందనీయం



మాట్లాడుతున్న అధికార ప్రతినిధి కిషోర్‌రెడ్డి

రాష్ట్ర అధికార ప్రతినిధి కిషోర్‌రెడ్డి

షాబాద్: దేశాభివృద్ధికి ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న కృషి అభినందనీయమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోరెడ్డి కిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆన్‌మోల్ గార్డెన్‌లో చేవెళ్ల అసెంబ్లీ మోర్చా సంయుక్త సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు తప్పా బీఆర్‌ఎస్ చేసిందేమీ లేదని, సీఎం కేసీఆర్ పాలన అంతా అవినీతిమయమన్నారు. కేసీఆర్‌ను ఫామ్‌హౌస్‌కి పరిమితం చేస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు బీజేపీనే ప్రత్యామ్నాయమన్నారు. రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని సూచించారు. బీఆర్‌ఎస్ వైఫల్యాలను వివరిస్తూ, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సిద్దిపేట బీజేపీ ఇన్‌చార్జి అంజన్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పార్టీ పటిష్టతకు శ్రేణులన్నీ పాటుపడుతున్నాయని తెలిపారు. చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి ప్రకాష్ మాట్లాడుతూ.. నిధులు, నియామకాలు, నీళ్ల విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కేవలం సీఎం కేసీఆర్ కుటుంబ పాలన జరుగుతుందన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్, బీజేపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి తదితరులున్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందదజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: కేశంపేట మండలంలోని ఇప్పలపల్లికి చెందిన మంద కృష్ణయ్య అనారోగ్యానికి గురై ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ విశాల, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌లు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఐదు వేల చొప్పున బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు, చంద్రమౌళి, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు

నందిగామ: శివసత్తుల పూనకాలు.. పోతురాజుల విన్యాసాలు.. కళాకారుల డప్పు వాయిద్యాల మధ్య మండలంలోని మోదళ్లగూడలో గ్రామస్తులు బోనాల ఊరేగింపును ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలో గత మూడు రోజులుగా అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ, బొడ్రాయి ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాలు నిర్వహించిన విషయం విధితమే. మూడో రోజు ఆదివారం సర్పంచ్ ఉమారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా మాజీ జెడ్పీవైస్ చైర్మన్ నవీన్‌రెడ్డి, ఎంపీటీసీ మాధవి, నాయకులు రవీందర్, ప్రవీణ్ రెడ్డి,రమేశ్, గణేష్, రాఘవేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెన్నారం రోడ్డుపై బ్రిడ్జి నిర్మించండి

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మంగళపల్లి నుంచి చెన్నారం వెళ్లే రోడ్డు గుండా ప్రవహించే వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖామంత్రి మహేంద్రనాద్ పాండేకు బీజేపీ సీనియర్ నాయకుడు రాంరెడ్డి, మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి ఎర్రవోలు శ్రీనివాసులు కోరారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డతండాలో ఆదివారం కేంద్రమంత్రి మహేంద్రనాద్ పాండేను వారు కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. వినతి పత్రం అందించిన వారిలో బీజేపీ నాయకులు శ్రీనివాస్, జంగయ్య, శ్రీనివాసులు, శ్రీశైలం యాదవ్, ఎడ్ల శ్రీశైలం, వెంకటేశ్, శ్రీకాంత్, మురళి తదితరులు ఉన్నారు.

ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలి



షాద్‌నగర్‌రూరల్: జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న సీపీఐ నాయకులు



చేవెళ్ల: బహిరంగ సభకు వెళ్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

సీపీఐ తాలుకా కో కన్వీనర్ శ్రీను

షాద్‌నగర్‌రూరల్: ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని సీపీఐ తాలుకా కో కన్వీనర్ శ్రీను డిమాండ్ చేశారు. కొత్తగూడెంలో నిర్వహించనున్న సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభకు ఆదివారం నియోజకవర్గం నుంచి సీపీఐ శ్రేణులు తరలివెళ్లారు. అనంతరం వారు మాట్లాడుతూ... దళితులకు మూడెకరాల భూమి, దళిత ముఖ్యమంత్రి, కేజీటు పీజీ ఉచిత విద్య, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఉచిత హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాక ప్రజల సమస్యలను పట్టించుకునే నాధుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. స్థలం ఉన్న వారికి ఇల్లు కట్టుకోవడానికి రూ 6లక్షలు ఇవ్వాలని, 9 ఏళ్లుగా ఇవ్వని కొత్త రేషన్ కార్డులను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ ప్రజాగర్జనకు తరలిన వారిలో సీపీఐ నాయకులు జంగయ్య, గోవింద్‌నాయక్, వెంకటేష్, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పవన్‌చౌహాన్ తదితరులు ఉన్నారు.

బహిరంగ సభకు తరలిన సీపీఐ నేతలు

చేవెళ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టి ప్రజలను సీపీఐ చైతన్యం చేస్తోందని ఆపార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. రామస్వామి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద నుంచి చలో కొత్తగూడెం భారీ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో సీపీఐ నాయకులు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. రామస్వామి ఆధ్వర్యంలో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏప్రిల్ 14 నుంచి మే15 వరకు సీపీఐ జాతీయ కమిటీ పిలుపు మేరక ఆయా గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో జరిగిన ఈ కార్యక్రమం ముగింపు సభను కొత్తగూడెంలో పార్టీ నిర్వహిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ప్రభులింగం, సత్యనారాయణ, సత్తిరెడ్డి, సదీర్, అంజయ్య, మంజుల, మల్లేశ్, మక్బుల్ ఉన్నారు.

బడి మొదలాయే.. పనులు పూర్తికాకపాయే

- అసంపూర్తిగా మన ఊరు– మన బడి పనులు
- ఈ సారి కూడా సమస్యలే స్వాగతం
- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

మొయినాబాద్: ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి చేపట్టిన మన ఊరు– మన బడి కార్యక్రమం పనులు ఇంకా పూర్తికాలేదు. సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్స్, వంట గదులు, కరెంటు ఫిట్టింగ్, చిన్న చిన్న మరమ్మతులు చేయించడానికి ప్రభుత్వం మండలంలోని 18 ప్రభుత్వ పాఠశాలలకు నిధులు మంజూరు చేసింది. ఇప్పటి వరకు రెండు పాఠశాలల్లోనే మాత్రం పనులు పూర్తిగా చేశారు. మిగతా చోట్ల అరకొరగానే పనులు కొనసాగుతున్నాయి. పెద్దమంగళారం, అజీజ్‌నగర్ ప్రాథమిక పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తి చేశారు. మేడిపల్లి ఉన్నత పాఠశాలలో వంటగది నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. తోలుకట్ట ప్రాథమిక పాఠశాల, మొయినాబాద్ ప్రాథమికోన్నత పాఠశాలలో పనులను ఇంకా ప్రారంభించనేలేదు. వేసవి సెలవుల్లోనే పనులన్నీ పూర్తి చేయాల్సి ఉండగా అన్ని చోట్ల అసంపూర్తిగానే ఉన్నాయి. నేటి (సోమవారం) నుంచి ప్రారంభమవుతున్న పాఠశాలల్లో ఈ సారి కూడా సమస్యలే స్వాగతం పలుకనున్నాయి. విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు ఇంత వరకు రాలేదు. సెలవుల్లోనే పాఠ్య పుస్తకాలను పాఠశాలలకు చేర్చి మొదటి రోజే పుస్తకాలు అందిస్తామని ప్రభుత్వం చెప్పినా అది ఆచరణకు నోచుకోవడం లేదు. అలాగే, విద్యార్థులకు యూనిఫాంలు సైతం రాలేదు. గతేడాది విద్యాసంవత్సరం మధ్యలో యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈ సారి పరిస్థితి ఎలా ఉంటుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో దైవభక్తి

ఎమ్మెల్యే కాలె యాదయ్య



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే,తదితరులు

మొయినాబాద్‌రూరల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని ఎత్‌మార్‌పల్లి గ్రామంలో ఏకత్వ ఫౌండేషన్ ఫౌండర్ బ్రహ్మశ్రీ బాందంపూడి శివకుమార్‌శర్మ, రాయపూడి శ్వేత, అశోక్‌కుమార్‌లు కలిసి ఏకత్వ హైందవ ధర్మపీఠం మందిరాన్ని ఎత్‌మార్‌పల్లి సమీపంలో నిర్మించారు. ఈ ఆలయ ప్రారంభోత్సవాలు స్పటిక శివలింగ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఐదురోజులుగా కొనసాగాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని శివ లింగానికి అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భక్తిభావం కల్గినప్పుడే మనిషికి మనశ్శాంతి కలుగుతోందన్నారు. దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలుగా మారాయని తెలిపారు. ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రవీందర్, రాజు, ప్రభాకర్, వేదపండితులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



షీల్డ్‌లను పంపిణీ చేస్తున్న జె.వి.కృష్ణారావు

మొయినాబాద్ రూరల్: క్రీడల్లో గెలుపోటములు సమానంగా తీసుకోవాలని జేబీ గ్రూప్ విద్యా సంస్థల కార్యదర్శి జే.వి.కృష్ణారావు అన్నారు. మండలంలోని అమ్డాపూర్ చౌరస్తాలోని జేబీఐటీ కళాశాలలో రాష్ట్రస్థాయి క్రీడాపోటీలను రెండు రోజుల పాటు నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్రస్థాయిలో 30 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి వివిధ క్రీడల్లో విద్యార్థులు పాల్గొన్నారు. క్రీడల్లో గెలుపొందిన వారికి ఆదివారం బహుమతుల పంపిణీ అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ.. క్రీడాపోటీల్లో యువత తమ నైపుణ్యాన్ని చాటుకున్నప్పుడే విజేతలుగా నిలుస్తారని అన్నారు. కళాశాలలో రాష్ట్రస్థాయి క్రీడలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జేబీఐటీ సీఈఓ ఎస్‌ఎస్ దశక, జేబీఐఈటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణమాచారి, క్యాప్ అడ్మినిస్ట్రేషన్ రాజశేఖర్ రెడ్డి, కళాశాల డీన్ కార్తికేయన్, ఫిజికల్ డైరెక్టర్ విఘ్నేష్, స్పోర్ట్స్ క్లబ్ డైరెక్టర్ ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రిలిమినరీ పరీక్ష

మొయినాబాద్: గ్రూప్ వన్ ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మండలంలో ఏర్పాటు చేసిన ఏడు పరీక్ష కేంద్రాల్లో 60 శాతం మంది అభ్యర్థులు మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. చిలుకూరు గురుకులం, గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల, జేబీఐటీ, అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చాలెంజర్ స్కూల్, భరత్‌తేజ స్కూల్, సిద్దార్థ కళాశాలలో పరీక్ష కేంద్రాల్లో మొత్తం 3552 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 2130 మంది అభ్యర్థులు మాత్రమే పరీక్ష రాశారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్ష జరిగింది. అభ్యర్థులు పరీక్ష సమయానికంటే అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. చేవెళ్ల ఆర్డీఓ వేణుమాధవరావు, ఏసీపీ ప్రభాకర్, ఇన్‌స్పెక్టర్ డీకే లక్ష్మీరెడ్డి పరీక్ష కేంద్రాలను సందర్శించారు.

చేవెళ్లలో..

చేవెళ్ల: మండలంలో గ్రూప్ –1 ప్రిలిమినరీ పరీక్షలు ఏడు సెంటర్‌ల్లో 2016 మంది అభ్యర్థుల కోసం ఏర్పాట్లు చేయగా పరీక్షలకు 1077 మంది హాజరు కాగా, 939 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాల, సిల్వర్‌డేల్, నవచైతన్య, శ్రీసత్యసాయిగ్రామర్ హైస్కూల్, వివేకానంద, శ్రీచైతన్య కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్ష కేంద్రాల వద్ద చేవెళ్ల పోలీస్‌లు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గట్టి బందోబస్త్ ఏర్పాటు చేశారు.

ప్రజల మెప్పు కోసమే ఆరోపణలు

జెడ్పీటీసీ మాలతి



సమావేశంలో మాట్లాడుతున్న మాలతి, ఇతర నాయకులు

చేవెళ్ల: ఎన్నికలు వస్తున్నాయని ప్రజల్లో మెప్పు కోసం లేనిపోని ఆరోపణలు అసత్య ప్రచారాలు చేసే పనిలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఉన్నారని జెడ్పీటీసీ మాలతి పేర్కొన్నారు. మండలకేంద్రంలో ఆదివారం బీఆర్‌ఎస్‌పార్టీ నాయకులతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేవెళ్లలో డిగ్రీ కళాశాల భవనం నిర్మాణం అలస్యం జరుగుతుందని గుర్తించిన ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యలు మూడు నెలల క్రితమే సంబంధిత అధికారులతో మాట్లాడి నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. పనులు పూర్తి చేసి కళాశాలను ప్రారంభించేందుకు సిద్ధమవుతుంటే కాంగ్రెస్ నాయకులు డిగ్రీ కళాశాల భవనం పూర్తి కాలేదని ధర్నాకు దిగుతామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఎన్ని జిమ్మిక్కులు చేసిన ఆ పార్టీ అధికారంలోకి వచ్చేదిలేదు సచ్చేదిలేదన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎంపీ రంజిత్‌రెడ్డిల సహకారంతో చేవెళ్ల అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ సత్యనారాయణచారి సర్పంచ్ జహంగీర్, చేవెళ్ల పట్టణ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, టీఆర్‌ఎస్‌వీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, ముడిమ్యాల పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లేశ్, తదితరులు ఉన్నారు.

చేవెళ్ల నుంచే పోటీ చేస్తా



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం

మాజీ ఎమ్మెల్యే కేఎస్. రత్నం

శంకర్‌పల్లి: వచ్చే ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గం నుంచే ఎమ్మెల్యేగా తాను పోటీ చేస్తానని మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం అన్నారు. ఆదివారం మండలంలోని మీర్జాగూడ, ఇంద్రారెడ్డినగర్, జనవాడ గ్రామాల్లో 'పల్లెపల్లెకు రత్నం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లో ప్రజల వద్దకు వెళ్లి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధిస్తోందని చెప్పారు. పార్టీ అధిష్ఠానం తనకు చేవెళ్ల నుంచి పోటీ చేసేందుకు అవకాశం కల్పిస్తోందని పూర్తి నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకే ×పల్లెపల్లెకు రత్నం₹ కార్యక్రమం ద్వారా ప్రజలను కలుస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రం ఏర్పాటు తరువాత దేశంలో ఎక్కడ లేని అభివృద్ధి జరిగిందన్నారు. అన్ని రంగాల్లో రాష్ట్రం అగ్రస్థానంలో నిలబడిందని ఇది కేసీఆర్, కేటీఆర్‌ల కృషితోనే సాధ్యమవుతుందని వివరించారు. మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీకే పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్సింహ్మా, మాజీ సర్పంచులు శ్రీధర్, సంజీవ, బయన్న, శంకర్‌పల్లి మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనాథ్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

రానున్న ఎన్నికల్లో బీజేపీదే విజయం

పార్టీ నాయకుడు రవి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

శంకర్‌పల్లి: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందని చేవెళ్ల నియోజకవర్గం బీజేపీ నాయకులు తొండ రవి పేర్కొన్నారు. మండలంలోని దొంతన్‌పల్లి నుంచి శంకర్‌పల్లి వరకు ఆదివారం ఆ పార్టీ నేత తొండ రవి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. కేంద్రం అందిస్తున్న పథకాలను ప్రజలకు చేరకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుపడుతుందని ఆరోపించారు. కేంద్ర పథకాలను సైతం రాష్ట్ర ప్రభుత్వం తామే అమలు చేసినట్లుగా చెప్పుకుంటూ పబ్బం గడుపుతుందన్నారు. అందుకు కేంద్ర పథకాల గురించి ప్రజలకు వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్ అధ్యక్షుడు సురేశ్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి రాజ్‌కుమార్, నాయకులు శశికాంత్‌రెడ్డి, హర్షనాయక్, ప్రవీణ్, హరీశ్‌చారి, మునివర్ధన్, శివకుమార్, భాను, సునీల్, పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.